ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
26 జనవరి
2026



# సంక్షేమం నుంచి సంపద సృష్టికి 'VB గ్రామ్ G'తోనే గ్రామ స్వరాజ్యం!

## డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎంపీ & బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు

**"భారతదేశం నేడు ఒక చారిత్రక మలుపులో ఉంది" . ఒకవైపు 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం, మరోవైపు ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు పరుగులు తీస్తున్న వృద్ధి రేటు. అయితే, ఈ ప్రయాణంలో మన గ్రామీణ భారతం కేవలం 'ఉపాధి' కోరుకునే స్థితిలో ఉండాలా? లేక దేశ వృద్ధికి 'ఇంధనం'గా మారాలా? అన్నదే నేటి ప్రాథమిక ప్రశ్న. గత రెండు దశాబ్దాలుగా అమలవుతున్న ఉపాధి హామీ పథకం (MGNREGA) ఒక సంక్షోభ నివారణ చర్యగా తన పాత్రను పోషించింది. కానీ, 2026 నాటి ఆధునిక భారతానికి కావాల్సింది కేవలం గుంతలు తవ్వే శ్రమ కాదు, గ్రామాన్ని ఒక ఆర్థిక శక్తిగా మార్చే 'VB గ్రామ్ G' (Vikasit Bharat Gram - Guaranteed Productivity).**

### గతం నేర్పిన పాఠం:

#### నిధుల వెల్లువ - నిలకడ లేని ఆస్తులు

గత 20 ఏళ్లలో ఉపాధి హామీ పథకం కింద ₹11.57 లక్షల కోట్లు ఖర్చు చేశాం. పదిహేను కోట్లకు పైగా జాబ్ కార్డులు జారీ అయ్యాయి. సంఖ్యల పరంగా ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక భద్రతా పథకం కావొచ్చు, కానీ ఫలితాల పరంగా చూస్తే తీవ్ర నిరాశ ఎదురవుతోంది.

అవకాశ వ్యయం (Opportunity Cost): మనం ఖర్చు చేసిన ఈ ₹11.53 లక్షల కోట్లతో 4.6 కోట్ల శాశ్వత గృహాలు లేదా 1.15 లక్షల కిలోమీటర్ల మేర 4-లేన్ జాతీయ రహదారులు నిర్మించి ఉండవచ్చు.

#### అసంపూర్ణ ఉపాధి:

చట్టబద్ధంగా 100 రోజుల హామీ ఉన్నప్పటికీ, జాతీయ సగటు 45-50 రోజులు మాత్రమే. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఇది 28 రోజులకు పడిపోవడం గమనార్హం.

ఉత్పాదకత లోపం: నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ హెచ్చరించినట్లుగా, ఈ పథకం శాశ్వత ఆస్తులను సృష్టించడంలో విఫలమై "ఖరీదైన నిల్వ వ్యవస్థ"గా మారింది.

### ప్రధాని మోదీ దార్శనికత:

#### సంస్కరణ అంటే తిరస్కారం కాదు!

ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ ఒక మాట చెబుతుంటారు---"ప్రభుత్వ పథకాలు పేదరికాన్ని నిర్మూలించాలి తప్ప, పేదరికాన్ని నిర్వహించకూడదు." 2005లో 28 శాతంగా ఉన్న పేదరికం, నేడు 5 శాతానికి తగ్గిందంటే దానికి కారణం మోదీ గారి సమగ్ర పేదరిక నిర్మూలన పథకాలు. ఇప్పుడు భారత్ మారింది. గ్రామాలకు విద్యుత్ వచ్చింది, డిజిటల్ విప్లవం చేరింది, మౌలిక వసతులు పెరిగాయి. అందుకే, మన ఉపాధి విధానం కూడా మారాలి.

VB గ్రామ్ G: ఒక నిర్మాణాత్మక విప్లవం

VB గ్రామ్ G అనేది కేవలం పేరు మార్పు కాదు, ఇది ఒక
Paradigm Shift. దీనిలోని ప్రధానాంశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మారుస్తాయి:

#### 1. బడ్జెట్ కేటాయింపులు - వికేంద్రీకరణ

ఈ పథకం కింద వార్షిక బడ్జెట్ ₹1,51,282 కోట్లుగా ప్రతిపాదించబడింది. ఇందులో కేంద్రం వాటా ₹95,692 కోట్లు (60%). దీని విశిష్టత ఏంటంటే, నిధుల వినియోగంపై పూర్తి అధికారం గ్రామసభలకే ఉంటుంది.

ప్రతి గ్రామానికి ఏటా ₹50 లక్షలు.

ఐదేళ్లలో ₹2.5 కోట్ల భారీ నిధి.

ఇది గ్రామాన్ని కేవలం నిధుల కోసం ఢిల్లీ వైపు చూసేలా కాకుండా, తన అభివృద్ధిని తానే రాసుకునేలా చేస్తుంది.

#### 2. వ్యవసాయానికి 'సంజీవని'

ప్రస్తుత ఉపాధి హామీ వల్ల వ్యవసాయ సీజన్లో కార్మికులు దొరక్క రైతులు అల్లాడిపోతున్నారు. VB గ్రామ్ G దీనికి విరుగుడుగా:

సాగు కాలంలో 60 రోజుల విరామం ప్రకటించి, కార్మికులు పొలం పనులకు అందుబాటులో ఉండేలా చేస్తుంది.

కూలీలకు అపరిపక్వ శ్రమ నుంచి నైపుణ్యాధారిత శిక్షణ (Skill Mapping) ఇస్తుంది. మేసన్రీ, సోలార్ మెయింటెనెన్స్, డ్రిప్ ఇరిగేషన్ టెక్నీషియన్స్ వంటి శిక్షణ పొందిన వారు రైతులకు గ్రామాల్లోనే అందుబాటులో ఉంటారు.

#### 3. ఉత్పాదకతతో కూడిన ఉపాధి

పనిదినాలను 100 నుండి 125 రోజులకు పెంచడం ద్వారా కూలీలకు భరోసా ఇస్తూనే, వారు చేసే ప్రతి పని ఒక శాశ్వత ఆస్తి (Permanent Asset)గా మారేలా నిబంధనలు రూపొందించాం. రోడ్లు, నీటి నిల్వ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, సోలార్ గ్రిడ్ల వంటి ఆస్తులు గ్రామానికి





దీర్ఘకాలిక ఆదాయాన్ని అందిస్తాయి.

#### పారదర్శకతకు పెద్దపీట

గతంలో నకిలీ జాబ్ కార్డులు, 'ఘోస్ట్' కార్మికుల వల్ల ప్రజాధనం లూటీ అయ్యేది. గుజరాత్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కోట్ల కొద్దీ నకిలీ కార్డులను మేం తొలగించాం. VB గ్రామ్ G లో:

AI ఆధారిత మానిటరింగ్ మరియు జియో ట్యాగింగ్.

రియల్ టైమ్ డాష్‌బోర్డుల ద్వారా ప్రతి పైసా లెక్క బహిరంగం.

15 రోజుల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాకే నగదు జమ.

#### స్వావలంబన దిశగా..

నిజమైన సామాజిక న్యాయం అంటే ప్రజలను ఎప్పటికీ ప్రభుత్వ సాయంపై ఆధారపడేలా చేయడం కాదు, వారిని స్వయం సమృద్ధి సాధించేలా చేయడం. 'VB గ్రామ్ G' పథకం ద్వారా గ్రామాలను ఉత్పాదక కేంద్రాలుగా మార్చాలన్న ప్రధాని మోదీ గారి సంకల్పం గొప్పది. ఇది కేవలం ఉపాధి పథకం కాదు, ఇది గ్రామ స్వరాజ్య సాధనలో ఒక మహా యజ్ఞం. భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలంటే, ఆ శక్తి మన గ్రామాల నుంచే రావాలి. ఆ నవ భారత నిర్మాణానికి 'VB గ్రామ్ G' పునాది రాయి కాబోతోంది

#### సంస్కరణల శంఖారావం:

MGNREGA vs VB గ్రామ్ G గత రెండు దశాబ్దాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ మార్పు ఎందుకు విప్లవాత్మకమైనదో ఈ క్రింది పోలికను చూస్తే అర్థమవుతుంది. పాత పథకం కేవలం 'ఉనికి' కోసం అయితే, కొత్త పథకం 'ఉత్పాదకత' కోసం.

#### ముఖ్యాంశాల పోలిక (Comparison Table)

ఫీచర్ పాత MGNREGA (2005-2025) కొత్త VB గ్రామ్ G (2026 నుండి)

లక్ష్యం కేవలం శ్రమకు ప్రతిఫలం (Survival) ఉత్పాదకత & ఆస్తుల సృష్టి (Growth)

పనిదినాలు చట్టబద్ధంగా 100 (అమలులో 45-50) 125 రోజులు (అటవీ ప్రాంతాల్లో 150)

నైపుణ్యం అపరిపక్వ శ్రమ (Unskilled) నైపుణ్యాధారిత శిక్షణ (Skilling)

నిధుల నిర్ణయం కేంద్రీకృత ప్రణాళిక (Top-Down) గ్రామ సభల ప్రణాళిక (Bottom-Up)

ఆస్తుల స్వభావం తాత్కాలికం (మట్టి పనులు) శాశ్వతం (రోడ్లు, సోలార్, కోల్డ్ స్టోరేజ్)

వ్యవసాయానికి మేలు కూలీల కొరతతో రైతులకు నష్టం 60 రోజుల అగ్రి-విరామం (రైతుకు మేలు)

పారదర్శకత నకిలీ కార్డుల ముప్పు ఎక్కువ

#### నిధుల విశ్లేషణ: గ్రామమే ఒక ఆర్థిక కేంద్రం

ప్రస్తుత గణాంకాల ప్రకారం, దేశంలోని 2.60 లక్షల గ్రామ పంచాయతీలకు నిధుల పంపిణీ ఇలా ఉండబోతోంది.

వార్షిక కేటాయింపు ₹1,51,282 కోట్లు

గ్రామ స్థాయి బడ్జెట్: ప్రతి గ్రామానికి ఏటా ₹50 లక్షలు నేరుగా అందుతాయి.

పంచవర్ష ప్రణాళిక: ఐదేళ్లలో ప్రతి గ్రామం తన అభివృద్ధి కోసం ₹2.5 కోట్ల భారీ నిధిని వినియోగించుకుంటుంది.

ఎందుకు ఈ మార్పు అవసరం? (అంకెల సాక్షిగా)

గత 20 ఏళ్లలో మనం ఖర్చు చేసిన ₹11.57 లక్షల కోట్లు చిన్న మొత్తం కాదు. ఈ నిధులు సరైన ఉత్పాదక ఆస్తుల వైపు మళ్లించి ఉంటే గ్రామీణ భారతం ఎప్పుడో స్వర్ణయుగంలో ఉండేది.


నకిలీల ఏరివేత: గత కొన్నేళ్లలో మోదీ ప్రభుత్వం సుమారు 5 కోట్లకు పైగా నకిలీ జాబ్ కార్డులను డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా తొలగించింది. అంటే ప్రజాధనం లీకేజీలను అరికట్టాం.

ఆస్తుల విలువ: పాత పద్ధతిలో 60% పైగా పనులు వానాకాలం రాగానే కొట్టుకుపోయే మట్టి పనులే. VB గ్రామ్ Gలో 75% పనులు శాశ్వత ఆస్తుల (Durable Assets) నిర్మాణానికే కేటాయించబడతాయి.

శిక్షణతో సాధికారత: పథకంలో చేరే ప్రతి 10 మందిలో ముగ్గురికి టెక్నికల్ శిక్షణ ఇచ్చి వారిని గ్రామానికి కావాల్సిన మేస్త్రీలుగా, మెకానిక్‌లుగా మార్చడం ద్వారా వారి రోజువారీ కూలీ విలువ కూడా పెరుగుతుంది.

డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారి మాటల్లో చెప్పాలంటే "మనం ఇచ్చే ప్రతి రూపాయి పేదవాడి కడుపు నింపడమే కాదు, ఆ పేదవాడి శ్రమ దేశం కోసం ఒక రోడ్డుగానో, ఒక చెక్ డ్యామ్‌గానో మారాలి. అప్పుడే అది నిజమైన అభివృద్ధి."

ప్రధాని మోదీ నాయకత్వంలో, ఈ 'VB గ్రామ్ G' పథకం భారతదేశంలోని 6 లక్షల గ్రామాల ఆర్థిక చిత్రపటాన్ని మార్చబోతోంది. సంక్షేమం నుంచి సంపద సృష్టి వైపు మన ప్రయాణం మొదలైంది.







## జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా 'వందేమాతరం' సామూహిక ఆలాపన

**ప్రభుత్వ సంచలన నిర్ణయం**

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, గుర్తింపు పొందిన అన్ని పాఠశాలలు మరియు కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, జిల్లా కలెక్టర్లు దీనిని స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. విద్యార్థుల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా గీతాలాపనతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను కూడా నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఈ ఆదేశాలను అత్యంత కఠినంగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయానికి తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (TRSMA) పూర్తి మద్దతు ప్రకటించింది. రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేశ్ రావు, కోశాధికారి పి. రాఘవేంద్ర రెడ్డి మరియు జాతీయ సలహాదారు కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి లు సంయుక్త ప్రకటన చేస్తూ.. ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను గౌరవించి, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కోరారు. భావి తరాల్లో జాతీయ భావాలను రగిలించేందుకు ఈ వందేమాతరం ఉత్సవం ఒక గొప్ప వేదికని వారు అభివర్ణించారు.

## గ్రామాలను కంటికి రెప్పలా కాపాడేది గ్రామదేవతలే

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: గ్రామదేవతలు గ్రామాలను, గ్రామ ప్రజలను కంటికి రెప్పలా కాపాడతారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో గ్రామస్తులు ఆదివారం నిర్వహించిన పోచమ్మ తల్లి పండుగలో ఆయన పాల్గొన్నారు. చిన్నమాసాయిపేటలో ఉన్న పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఊరి పొలిమేరల్లో ఉంటూ ఊర్లను, ప్రజలను.. వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, దుష్టశక్తుల నుండి కాపాడుతూ రక్షక శక్తులుగా ఉండేది గ్రామదేవతలేనని పేర్కొన్నారు. అలాంటి గ్రామదేవతలకు ప్రతి ఏటా పండుగ నిర్వహిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతిలోని రాళ్లు, పువ్వులను దేవతలుగా ఆరాధిస్తూ పూజలు జరిపే గొప్ప సంస్కృతి తెలంగాణకే సొంతమన్నారు. గ్రామదేవతల పండుగలను నిర్వహించుకోవడం వల్ల గ్రామాలు సుభిక్షంగా ఉండడమే కాకుండా.. కులమతాలకు అతీతంగా నిర్వహించే గ్రామదేవతల పండుగలతో ప్రజల్లో ఐక్యత పెరుగుతుందని చెప్పారు. ఇక గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్న ఆయన.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధికి తన సహకారం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం జహంగీర్ విజయ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మాసాయిపేట గ్రామశాఖ అధ్యక్షుడు సత్యప్రకాశ్ గౌడ్, వార్డు సభ్యులు హేమలత శ్రీశైలం, వాకిటి పాండు, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ యాకూబ్, కాంగ్రెస్ నాయకులు కోల కృష్ణ గౌడ్, శేఖర్, నర్సింహులు, సగ్గ కిష్టయ్య, తిరుమలేశ్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

## మర్డర్ కేసులో ముగ్గురు నిందితులు రిమాండ్

**ఈ నెల 23న మైలారుగూడెం శివారులో ఠాగూర్ నిశాంత్ హత్య**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలం మైలారుగూడెం గ్రామ శివారులో ఈ నెల 23న హత్యకు గురైన రౌడీషీటర్ ఠాగూర్ నిశాంత్ కు సంబంధించిన కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను పట్టుకుని రిమాండ్ కు తరలించారు. ఆదివారం యాదగిరిగుట్ట టౌన్ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న రాత్రి 7 గంటల సమయంలో మైలారుగూడెం గ్రామంలోని హరిహర కాటేజ్ లో యాదగిరిగుట్టకు చెందిన రౌడీషీటర్ ఠాగూర్ నిశాంత్(33) హత్యకు గురయ్యాడు. ఈ నెల 24న మృతుడి సోదరి ఠాగూర్ దీపిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా హత్యకు పాల్పడిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 25న నమ్మదగిన సమాచారం ఆధారంగా యాదగిరిగుట్టలోని సన్నిధి హోటల్ సమీపంలో యాదగిరిగుట్టకు చెందిన వనగంటి ఉపేందర్, ఆకుల బాలమల్లేష్ ను.. మైలారుగూడెం గ్రామానికి చెందిన బెల్లంకొండ సాయికుమార్ ను అతని ఇంట్లోనే అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో ఠాగూర్ నిశాంత్ ను మర్డర్ చేసింది తామేనని నిందితులు ఉపేందర్, బాలమల్లేష్, సాయికుమార్ అంగీకరించడంతో.. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. విచారణ నిందితుల నుండి రాబట్టిన ఆధారాల మేరకు పరారీలో మరికొంత మంది నిందితులు ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ భాస్కర్ స్పష్టం చేశారు. కాగా ఈ కేసులో హోండా యాక్టివా స్కూటీ, హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# యాదగిరిగుట్టలో ఫుల్ రష్

### ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం

### ఆదివారం ఆలయానికి రూ.53.22 లక్షల ఆదాయం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ఫుల్ రష్ నెలకొంది. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో.. యాదగిరిగుట్ట ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. కొండ కింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపం.. కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. భక్తులు అధికసంఖ్యలో సొంత వాహనాల్లో రావడంతో.. పార్కింగ్ ప్లేస్ నిండిపోయి రింగు రోడ్డు, ఘాట్ రోడ్డు సర్కిల్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు డైవర్షన్లు పెట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఇక ఆదివారం స్వామివారిని రెరా చైర్మన్ సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా.. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.53,22,872 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.20,03,630, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.7.85 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.8.40 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.4,03,800 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.





# వైభవంగా పాతగుట్ట అధ్యయనోత్సవాలు

**రెండో రోజు పురప్పాట్టు సేవ, తిరుమంజనం, దివ్యప్రబంధ సేవాకాలం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట దేవస్థానానికి అనుబంధ ఆలయమైన పూర్వగిరి(పాతగుట్ట) నరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న అధ్యయనోత్స వాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో పురప్పాట్టు సేవ, తిరుమంజనం, దివ్యప్రబంధ సేవాకాలం మహోత్సవాలను ఆలయ ప్రధానార్చకులు కాందూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నిత్య ఆరాధనల అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయంలోని స్వామివారి మూలవిరాట్లకు 'తిరుమంజనం' వేడుకను ఆలయ సంప్రదాయరీతిలో పారాయణీకుల పారాయణాలు, వేదపండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అలయ మాడవీధుల్లో పురప్పాట్టు సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక సాయంత్రం ఆలయంలో స్వామివారి నిత్యారాధనల తర్వాత మొదట పురప్పాట్టు సేవ చేపట్టిన అనంతరం.. దివ్యప్రబంధ సేవాకాలం ఉత్సవాన్ని అర్చకులు నయనానందకరంగా జరిపించారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా తెప్పించిన పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అలంకర ణలో లక్ష్మీసమేత నారసింహుడిని ఆలయ తిరువీధుల్లో విహరింపజేసి 'పురప్పాట్టు సేవ' నిర్వహించారు.

**నేడు తిరుమంజనం, పరమపద ఉత్సవం**

పాతగుట్ట నరసింహుడి అధ్యయనోత్సవాల్లో భాగంగా మూడోరోజైన సోమవారం ఆలయంలో స్వామివారి మూలవిరాట్లకు తిరుమంజనం, పరమపద ఉత్సవం నిర్వహించనున్నారు. 27న నిర్వహించే నూత్తందాది శాత్తుమొరై పూజలతో అధ్యయనోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

# యాదగిరిగుట్టలో ఘనంగా 'రథసప్తమి' వేడుకలు



**ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి స్వర్ణరథంలో విహరించిన నారసింహుడు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం 'రథసప్తమి' వేడుకలు వైభవంగా జరిగాయి. రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లక్ష్మీనరసింహుడిని వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలతో చూడముచ్చటగా ముస్తాబు చేసి ప్రభాతవేళలో స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. సూర్యప్రభ వాహనంపై ఆశీనులైన స్వామివారిని.. అర్చకులు ప్రధానాలయ పశ్చిమ రాజగోపురం నుండి బయటకు తీసుకువచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఊరేగింపు అనంతరం తూర్పు రాజగోపురం ఎదుట స్వామివారిని అధిష్టింపజేసి చతుర్వేద పారాయణాలు గావించారు. ఇక సాయంత్రం నారసింహుడిని అందంగా ముస్తాబు చేసి స్వర్ణరథంలో ఊరేగించారు. బంగారు రథంలో ఆలయ అంతఃప్రాకార వీధుల్లో స్వామివారు విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఈ వేడుకలను ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కాందూరి వెంకటాచార్యులు రథసప్తమి విశిష్టతను భక్తులకు ప్రవచించారు. రథసప్తమి రోజున స్వామివారిని దర్శించుకుంటే అంతా శుభం జరుగుతుందని, కోరిక కోర్కెలు ఫలిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వినోద్ రెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
26 జనవరి
2026





# మూడో టీ20లో భారత్ జయభేరి

## సిరీస్ కైవసం.. మెరిసిన బుమ్రా, అభిషేక్





గువాహటి: మరో రెండు వారాల్లో సొంతగడ్డపై మొదలుకాబోతున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఆతిథ్య భారత జట్టు మరోసారి అదరగొట్టింది. స్వదేశంలో 15 నెలల వ్యవధిలోనే న్యూజిలాండ్‌కు టెస్టు, వన్డే సిరీస్‌ను కోల్పోయి తీవ్ర విమర్శలెదుర్కొంటున్న టీమ్‌ఇండియా.. టీ20ల్లో మాత్రం కివీస్‌కు ఆ అవకాశమివ్వలేదు. బ్యాట్, బంతితో రెచ్చిపోతున్న టీమ్‌ఇండియా.. గువాహటి వేదికగా జరిగిన మూడో టీ20లో ప్రత్యర్థిపై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌లో 3-0 ఆధిక్యం సాధించింది. ఇరుజట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో కివీస్ నిర్దేశించిన 154 పరుగుల లక్ష్యాన్ని సూర్య సేన.. 10 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.

అభిషేక్ శర్మ (20 బంతుల్లో 68 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్సులు) ఎప్పట్లాగే విధ్వంసం సృష్టించగా గత మ్యాచ్‌తో ఫామ్‌ను అందుకున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సులు) దంచికొట్టడంతో మరో 60 బంతులు మిగిలుండగానే మెన్ ఇన్ బ్లూను విజయం వరించింది. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' బుమ్రా (3/17), రవి బిష్ణోయ్ (2/18), హార్దిక్ పాండ్యా (2/23) ధాటికి నిర్ణీత ఓవర్లలో 153/9కే పరిమితమైంది. గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 48, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్.

### అభి'షేక్' ఆడించాడు..

కివీస్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికే తంటాలు పడ్డ పిచ్‌పై ఛేదనలో భారత జట్టు తొలి బంతికే సంజూ శాంసన్ వికెట్ కోల్పోయినా అభిషేక్, గత మ్యాచ్ హీరో ఇషాన్ కిషన్ (28) విధ్వంసంతో లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ దంచేసింది. కిషన్ వస్తూనే 6, 6, 4తో ఛేదనను ప్రారంభించగా అభిషేక్ రెండో ఓవర్లో 6, 4, 4తో డఫ్ఫీకి స్వాగతం పలికాడు. తర్వాతి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదిన అతడు ఇషాన్ ఔట్ అయినా దంచుడు ఆపలేదు. దీంతో 5 ఓవర్లకే భారత్ సగం లక్ష్యాన్ని (72/2) ఊదేసింది. ఇక సూర్య రాకతో బంతి ఫీల్డర్లు, బౌలర్ల చేతిలో కంటే బౌండరీ లైన్ ఆవలే ఎక్కువసేపు ఉందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. డఫ్ఫీ ఆరో ఓవర్లో రెండు బౌండరీలు, సిక్స్‌తో 14 బంతుల్లోనే అభిషేక్ ఫిఫ్టీ పూర్తిచేశాడు. భారత్ తరఫున ఇది రెండో వేగవంతమైన అర్ధ శతకం (మొదటిది యువరాజ్ సింగ్-12 బంతుల్లో 2007 ఇంగ్లండ్‌పై). పవర్ ప్లేలోనే భారత్ 94/2తో నిలిచింది. సూర్య కూడా లయ అందుకోగానే బౌండరీలతో విరుచుకుపడటంతో ఛేదన మరింత తేలికైంది. ఫిలిప్స్ వేసిన పదో ఓవర్లో 6, 4తో వరుసగా రెండో హాఫ్ సెంచరీ చేసిన కెప్టెన్.. ఆఖరి బంతిని బౌండరీగా మలిచి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 153/9 (ఫిలిప్స్ 48, చాప్‌మన్ 32, బుమ్రా 3/17, బిష్ణోయ్ 2/18);

భారత్: 10 ఓవర్లలో 155/2 (అభిషేక్ 68లి, సూర్య 57లి, హెన్రీ 1/28, సోధి 1/28)

---

## పెర్త్ సిక్సర్.. బిగ్‌బాష్ లీగ్‌లో ఆరో టైటిల్



పెర్త్: నెలన్నర రోజులుగా క్రికెట్ అభిమానులను అలరించిన బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్) 15వ సీజన్‌లో పెర్త్ స్కార్చర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం పెర్త్ వేదికగా జరిగిన బీబీఎల్ ఫైనల్‌లో ఆ జట్టు.. సిడ్నీ సిక్సర్స్‌పై 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించి ఈ లీగ్‌లో ఆరో ట్రోఫీని తమ ఖాతాలో వేసుకుంది.

ఫైనల్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సిడ్నీ బ్యాటర్లు.. రిచర్డ్‌సన్ (3/32), డేవిడ్ పైన్ (3/18) రాణించడంతో 20 ఓవర్లలో 132 రన్స్‌కే ఆలౌట్ అయ్యారు. ఛేదనను పెర్త్ 17.3 ఓవర్లలోనే దంచేసింది. మిచెల్ మార్ష్ (44), అలెన్ (36) రాణించారు. ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఒక జట్టు ఆరు టైటిల్‌లు గెలవడం ఇదే ప్రథమం. ఐపీఎల్‌లో తలా ఐదు టైటిల్స్‌తో చెన్నై, ముంబై రికార్డును పెర్త్ అధిగమించింది.

## సన్‌రైజర్స్‌కు మూడో టైటిల్



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో జరిగిన ఎస్ఎ20 ఫైనల్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్స్ మూడో టైటిల్‌ను సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో సన్‌రైజర్స్.. ప్రిటోరియా క్యాపిటల్స్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించింది.


ఆడిన నాలుగు సీజన్లలో నాలుగుసార్లూ ఫైనల్ చేరిన సన్‌రైజర్స్.. మూడు టైటిల్స్ సాధించడం విశేషం.

---

## క్వార్టర్స్‌కు సబలెంకా, గాఫ్..

# మెద్వెదెవ్‌కు షాక్





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ మూడో టైటిల్ వేటలో ఉన్న ప్రపంచ నెంబర్ వన్ టెన్నిస్ ర్యాంకర్ అరీనా సబలెంకా ఈ టోర్నీ క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం రాడ్ లీవర్ ఎరీనాలో జరిగిన మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌లో సబలెంకా.. 6-1, 7-6 (7/1)తో 19 ఏండ్ల కెనడా అమ్మాయి విక్టోరియా బొకాపై గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. 31 నిమిషాల్లో ముగిసిన తొలి సెట్‌లో బొకా నుంచి సబలెంకాకు ప్రతిఘటనేమీ ఎదురుకాకపోయినా రెండో సెట్‌లో మాత్రం శ్రమించాల్సి వచ్చింది.

ఇరువురూ పాయింట్ల కోసం హోరాహోరీగా తలపడటంతో సెట్ కాస్తా టైబ్రేకర్‌కు వెళ్లింది. టైబ్రేక్‌లో సబెలంకాదే పైచేయి అయినా బొకా పోరాటం ఆకట్టుకుంది. క్వార్టర్స్‌లో యూఎస్ అమ్మాయి, 18 ఏండ్ల ఇవా జొవిచ్‌తో తలపడనుంది. మరో పోరులో మూడో సీడ్ కోకో గాఫ్ (యూఎస్).. 6-1, 3-6, 6-3తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. క్వార్టర్స్‌లో గాఫ్.. 12వ సీడ్ ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్వితోలినతో అమీతుమీ తేల్చుకోనుంది.

### మెద్వెదెవ్ ఇంటికి..

పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ కార్లొస్ అల్కరాజ్ (స్పెయిన్) 7-6 (8/6), 6-4, 7-5తో టామీ పాల్ (యూఎస్)ను చిత్తుచేసి క్వార్టర్స్‌కు ప్రవేశించాడు. కానీ 11వ సీడ్ డానియల్ మెద్వెదెవ్‌కు షాక్ తగిలింది. ప్రిక్వార్టర్స్‌లో మెద్వెదెవ్ 4-6, 0-6, 3-6తో లర్నర్ టైన్ (యూఎస్) చేతిలో ఓటమిపాలయ్యాడు. మిగిలిన మ్యాచ్‌ల్లో లెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా), అలగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) తమ ప్రత్యర్థులను ఓడించారు. నేడు జరగాల్సిన ప్రిక్వార్టర్స్ నుంచి జాకుబ్ మెన్సిక్ (చెక్) గాయంతో తప్పుకోవడంతో నొవాక్‌జొకోవిచ్ క్వార్టర్స్‌కు ముందంజ వేశాడు. క్వార్టర్స్‌లో అల్కరాజ్.. మినార్‌తో ఆడాల్సి ఉండగా జ్వెరెవ్, టైన్‌తో తలపడతాడు.

---

## హైదరాబాద్ ఓటమి



రంజీ ట్రోఫీ 2025-26 సీజన్‌లో హైదరాబాద్ జట్టు నాకౌట్‌కు వెళ్లే అవకాశాలు మూసుకుపోయినట్టే! ఎలైట్ గ్రూప్-డీలో భాగంగా సొంతగడ్డపై ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో దారుణ పరాభవానికి గురైంది. తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగులకే ఆలౌట్ అయి ఫాలో ఆన్ ఆడిన హైదరాబాద్.. నాలుగో రోజు 166/7తో ఆట ఆరంభించి కాస్త ప్రతిఘటించింది.

లోయరార్డర్‌లో మిలింద్ (85), నితిన్ (32), కెప్టెన్ సిరాజ్ (32) పోరాడి ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించి ముంబై ఎదుట 10 పరుగుల లక్ష్యాన్ని నిలిపారు.

అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ముంబై ఒక వికెట్ కోల్పోయి 9 వికెట్ల తేడాతో ఘనవిజయాన్ని నమోదుచేసింది. తాజా ఓటమితో గ్రూప్ డీ లో ముంబై (30) నాకౌట్‌లో తమ స్థానాన్ని ఖాయం చేసుకోగా జమ్మూకాశ్మీర్(21) రెండో స్థానంలో ఉంది. 13 పాయింట్లతో హైదరాబాద్ ఐదో స్థానాన నిలిచింది.

